
సాక్షి
బాపట్ల
శనివారం । 15 । జూలై । 2023



కార్మెల్ మాత ఉత్సవాలు ప్రారంభం

ఫిరంగిపురం: కార్మెల్ కొండపై కార్మెల్ మాత ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దివ్యపూజాబలి కార్యక్రమంలో విచారణ గురువు రాజేష్‌రెడ్డి వాక్యోపదేశం చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 716 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 482 క్యూసెక్కులు వదిలారు.



దుర్గమ్మ సన్నిధిలో సారె సంబరం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు సారెను సమర్పించారు.

న్యూస్‌రీల్

22న ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: ప్రత్యేక లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఒ.వెంకట నాగేశ్వరరావు శుక్రవారం కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 22న ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదాలత్‌లో మోటారు వాహన ప్రమాదాల కేసులు, ముందస్తు వ్యాజ్యాలు, భూసేకరణ కేసులు మాత్రమే రాజీ మార్గం ద్వారా పరిష్కరించనున్నట్టు వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

36,990 ఓటర్ కార్డులు




గుంటూరు వెస్ట్: కొత్తవి, చిరునామా మార్చుకున్నవి మొత్తం 36,990 ఓటర్ కార్డులు దరఖాస్తు చేసుకున్న వారికి అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో చంద్రమౌళీ నగర్ పోస్టల్ శాఖాధికారులకు ఓటరు కార్డులు ఉన్న కవర్లను అందజేశారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో అర్హులకు ఈ కార్డులు స్పీడ్ పోస్ట్ ద్వారా తపాలా శాఖ అందించనుంది.

22న పుస్తకాల పంపిణీ



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 22న ఆయా పాఠశాలల్లోనే పుస్తకాలు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాల ద్వారా 20వ తేదీనే పుస్తకాలను సంబంధిత పాఠశాలలకు చేర్చాలన్నారు. అలాగే, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు వచ్చే నెల నుంచి టేక్ హోం రేషన్ అందజేయాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంను కిలోకు రూ.40 వెచ్చించి ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం కొనుగోలు చేస్తోందన్నారు. వాటిని అక్రమ మార్గంలో విక్రయించినా, కొనుగోలు చేసినా నేరమని తెలిపారు. ఈ బియ్యాన్ని అన్నం, టిఫిన్స్, తినుబండారాల్లోనూ వాడుకోవచ్చని తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ కోమలి పద్మ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, డీఈఓ శైలజ, బి.మనోరంజని జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డులో 29,955 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 26,968 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,955 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.13,000 నుంచి 22,300 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,000 నుంచి రూ. 24,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,098 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 518.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,547 ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 5,897 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

అండగా నిలి‘చే నేత’

- చేనేత రంగానికి సీఎం జగన్ జవసత్వాలు
- నేతన్న నేస్తం ద్వారా ప్రతి కార్మికుడికీ రూ.24 వేలు
- 21న నేతన్న నేస్తం ఐదో విడత పంపిణీ

చీరాల: గత పాలకుల నిర్లక్ష్యంతో కునారిల్లిన చేనేత రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊపిరిలూదుతున్నారు. సొంత మగ్గం ఏర్పాటు చేసుకుని స్వయంగా చేనేత వస్త్రాలు నేసి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని ఆర్థికంగా నిలబడేందుకు ప్రతి కార్మికుడికీ వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు.

వైఎస్సార్ హయాంలోనూ వైభవం

వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా ముఖ్యమంత్రిగా ఉండగా చేనేతలకు అండగా నిలబడ్డారు. చేనేత రుణబకాయిలు రూ.300 కోట్లు మాఫీ చేశారు. నిర్వీర్యమైన ఆప్కోకు నిధులు కేటాయించి బలోపేతం చేశారు. చిలపనూలు, రంగు, రసాయనాలపై 10 శాతం సబ్సిడీని ప్రకటించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అప్పటివరకు ఉన్న చిలపనూలుపై 9.2 శాతం ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేయించారు.

నేతన్నకు నేనున్నానంటూ..

తండ్రి అడుగుజాడల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టగానే చేనేత కార్మికుల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఏటా రూ.24 వేలు చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలుగా నగదు జమ చేశారు. ఈనెల 21న నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఐదో విడత పంపిణీ కార్యక్రమానికి పూనుకున్నారు. గతంలో సహకార రంగం (సొసైటీ)లో ఉన్న కార్మికులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేవి. అయితే నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఆర్థిక సాయం అందుతోంది.

ఆప్కో ద్వారా కొనుగోళ్లు

మగ్గంపై నేసిన వస్త్రాల కొనుగోలుకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆప్కోకు నిధులు కేటాయించి దాని ద్వారా వస్త్రాలను కొనుగోలు చేయిస్తున్నారు. ఇవి కాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన, అమ్మఒడి, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా, ముద్రా రుణాలూ చేనేత కార్మికులకు అందుతున్నాయి.



జగనన్న సాయం భేష్

వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్దది చేనేత రంగం. దీని అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయం. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు అందించడంతోపాటుగా ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు, ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. రంగులు, రసాయనాలపై పన్నులు తగ్గించారు.

– దామర్ల బాలకృష్ణ
చేనేత కార్మికుడు, ఈపురుపాలెం



జగనన్నకు రుణపడి ఉంటాం..

సీఎం జగనన్న మా సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. చేనేతలు సొంత మగ్గం ఏర్పాటు చేసుకుని వృత్తిలో రాణించేందుకు ‘నేతన్ననేస్తం పథకాన్ని రూపొందించి ఏడాదికి రూ.24 వేలు అందించడం గొప్ప సాయం. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–కొసనం జ్యోతిర్మయి. చేనేత కార్మికురాలు, ఈపురుపాలెం

నేతన్న నేస్తం లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
2019–20	7,780	18.67
2020–21	7,589	18.21
2021–22	7,768	18.64
2022–23	8,286	19.88
2023–24 (తాజాగా)	8,378	20.11

మగ్గం కొనుక్కున్నా



నేతన్న నేస్తం ద్వారా మగ్గం కొనుక్కున్నా. గతంలో పెట్టుబడులకు ఇబ్బందులు పడేవాళ్లం. నూలు కొనుగోలు చేయాలన్నా సమస్యగా ఉండేది. చాలా అవస్థలు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ. 24 వేలు అందిస్తున్నారు. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వం కలకాలం ఉండాలని కోరుకుంటున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయన వల్లే మా జీవితాల్లో మార్పు వచ్చింది.

– వార్తి సరోజిని, రామన్నపేట

• పులకించె.. చూశాక..



గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకారంలో మెరిశారు. దేవేరితో పాటు అంతరాలయమూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు సుంగధ ద్రవ్యాలతో శోభాయమానమై మురిసింది. అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తల్లి మనోహర రూపాన్ని చూశాక పులకించి పోయారు. ఆధ్యాత్మికోత్సాహంలో ఓలలాడారు. ఆదివారం వరకూ అమ్మ శాకంబరిగా దర్శనమిస్తారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు కదంబ ప్రసాదాన్ని వితరణ చేశారు.

–పెదకాకాని

• వజ్రాల వేట.. ఆశల మూట



ముప్పాళ్లలోని పిడుగురాళ్ల రోడ్డులో ఓ వెంచర్‌లో స్థానికులు వజ్రాల కోసం వెతుకులాడుతున్నారు. ఇక్కడికి మెరక కోసం వెంచర్ యజమాని రాజుపాలెం మండలం బలిజేపల్లి, బెల్లంకొండ నుంచి ఎర్రమట్టిని తీసుకొచ్చాడు. అందులో వజ్రాలు, రత్నాలు ఉంటాయనే ప్రచారం జరిగింది. గతంలో బెల్లంకొండ ప్రాంతంలోని కోళ్ళూరు గ్రామంలో వజ్రాలు దొరికేవనడానికి చారిత్రక ఆధారాలు ఉండడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది. దీంతో ప్రజలు ఆశగా మట్టిలో ఇలా వజ్రాల వేట మొదలెట్టారు. ఈ మట్టిలో వజ్రాల మాటేమోగానీ రంగురాళ్లు మాత్రం దొరుకుతున్నాయి. ఇదే అదునుగా కొందరు రాళ్లను పరిశీలించి వజ్రాలో కాదో చెబుతామంటూ ఒక్కో రాయికి రూ.వంద నుంచి రూ.50 వరకు దోచుకుంటున్నారు.

– ముప్పాళ్ల

రూ. 10 లక్షలు దోపిడీ



గుంటూరు ఈస్ట్ : రూ. 10 లక్షలు నగదు ఉన్న బ్యాగును ఆగంతకుడు తీసుకుని పరారైన ఘటనపై గుంటూరు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరి హరిబాబు అనే వ్యక్తి తాను పనిచేసే చిల్లీస్ కంపెనీ డబ్బులు డ్రా చేసేందుకు శుక్రవారం లక్ష్మీపురంలోని హెడీఎఫ్‌సీ బ్యాంకుకు వెళ్లాడు. రూ.10 లక్షలు డబ్బులు డ్రా చేసి బ్యాగులో పెట్టుకుని బయటకు వచ్చి ద్విచక్ర వాహనానికి తగిలించాడు. ఓ వ్యక్తి హరిబాబు వద్దకు వచ్చి డబ్బులు కింద పడ్డాయని చెప్పాడు. హరిబాబు కిందకు వంగి కిందపడిన డబ్బులు తీసుకుంటుండగా మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి డబ్బులు ఉన్న సంచిని లాక్కుని పరారయ్యాడు. హరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల చేత పేపర్లు దిద్దిస్తారా

- ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆగ్రహం
- బీసీ బాలుర గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : విద్యార్థుల చేత పేపర్లు దిద్దిస్తారా.. పద్ధతి మార్చుకోవాలి అంటూ జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులపై వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత కాలం నుంచి గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, ఇతర సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బోధన సక్రమంగా లేదని, పాఠశాల నుంచి 50 మందికిపైగా విద్యార్థులు టీసీలు తీసుకొని ఇతర పాఠశాలలకు వెళ్లారని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ టి.వి.ప్రసాద్‌తోపాటు ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు బాబూరావుతోపాటు మరికొందరు ఉపాధ్యాయులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో ఇటీవల పాఠశాల సెక్రటరీకి ఫిర్యాదులు అందాయని, తమకు వ్యతిరేకంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారనే కోపంతో విద్యార్థులను బెదిరించి వారికి అనుకూలంగా సంతకాలు పెట్టించుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటి ఘటనలు జరిగితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. విద్యార్థులతో పేపర్లు దిద్దించడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఫోన్‌చేసి పాఠశాలలోని సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడి భోజన, వసతి, ఇతర వివరాలపై ఆరా తీశారు.

అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శం

- జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
- రూ. 1.50 కోట్లతో డబుల్ రోడ్లు ప్రారంభం
- ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ వెంకాయమ్మ, కలెక్టర్ బాషా, ఎమ్మెల్యే కరణం

చీరాల రూరల్: అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. శుక్రవారం వేటపాలెం మండలంలోని కొత్తపేటలో వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎస్ కళాశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ నిధులు రూ.1.50 కోట్లతో 1.2 కిలో మీటర్లు డబుల్ రోడ్డు, కొత్తపేటలోని జంక్షన్ వద్ద రూ.25 లక్షల సిమెంట్ రోడ్ల నిర్మాణాలను జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలసి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం కొత్తపేటలోని బీఎస్ఆర్ కల్యాణ మండపంలో వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో సఫలీకృతమయ్యారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలతో ఎంతో సుభిక్షంగా, సురక్షితంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా 175 స్థానాలు అందించి జగనన్నను సీఎంగా చేసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో నిమగ్నమయ్యారని అందుకే అడిగిన వెంటనే జెడ్పీ, పంచాయతీ రాజ్ నిధులు మంజూరు చేశామని చెప్పారు. ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్, ప్రభుత్వం, ఇతర అధికారులందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అడిగిన వెంటనే నిధులు కేటాయించిన జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు. ఫైరాఫీసు గేట్ వద్ద రూ.67 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. అలానే వాడరేవు నుంచి నరసరావుపేట, పిడుగురాళ్ల వరకు నేషనల్ హైవే నిర్మాణం, అలానే ఈపురుపాలెం వద్ద మరో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభించిన ఈ అభివృద్ధిపనులు చీరాల, వేటపాలెం మండలాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఆర్డీవో సరోజిని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వేటపాలెం తహసీల్దార్ అశోక్ వర్ధన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ ఆర్మీ ర్యాలీ జయప్రదం చేద్దాం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఏర్పాట్లపై ఆర్మీ అధికారులు, ఎస్పీతో కలిసి సమీక్ష
- డీఎస్ఏ స్టేడియాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్



అగ్నిపథ్ ర్యాలీ సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: నరసరావుపేటలో ఆగస్టు 20 నుంచి 26 వరకు నిర్వహించే అగ్నిపథ్ ఆర్మీ ర్యాలీని విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, ఆర్మీ అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ర్యాలీ నిర్వహణపై సూచనలు చేశారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ(డీఎస్ఏ) స్టేడియంలో దీనికోసం వసతులు కల్పించాలని ఆదేశించారు. అంతకుముందు సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లను ఆర్మీ అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ వసంతబాబు, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్ పాల్గొన్నారు.

ఇక ఇంటి వద్దకే పౌష్టికాహారం

- గర్భిణులకు, బాలింతలకు పంపిణీ
- కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: గర్భిణులు, బాలింతలకు పోషకాహార పదార్థాలను ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఇంటి వద్దకే అధికారులు పంపిణీ చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో కలెక్టరేట్‌లోని స్పందన హాలులో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. చిన్నారులలో పోషణ లోపం పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. పౌష్టికాహారం సక్రమంగా అందకపోవడంతోనే చిన్నారుల్లో ఎదుగుదల తక్కువగా ఉందన్నారు. పోషణ లోపాన్ని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బలవర్ధక ఆహార పదార్థాలు అందిస్తున్నా.. వయస్సుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేకపోవడంపై అధికారులను నిలదీశారు. అద్దంకి మండలంలో 34 మంది చిన్నారులు పోషణ లోపానికి గురైతే కేవలం తొమ్మిది మందికే ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సీడీపీఓలు సూపర్‌వైజర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలని పీడీని ఆదేశించారు. చిన్నగంజాం మండలంలో 31 మంది బాలల్లో కేవలం 20 మందికి సంపూర్ణ పోషణ ఇవ్వడంపై అధికారులను నిలదీశారు. బాపట్ల మండలంలో 21 మందిలో ఏడుగురికి అందకపోవడం, పర్చూరులో 64శాతం నమోదు కావడంపై ఆరా తీశారు.

ఇంటి వద్దకే రేషన్

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఇక నుంచి టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లాలో 15,1970 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారని పేర్కొన్నారు. వారందరికీ పౌష్టికాహారం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. పంపిణీ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులందరికీ ఆధార్ కార్డులు ఉండేలా చూడాలన్నారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ 15 మండలాలలో తక్కువగా ఉండడంపై సమీక్షించారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా పాల్గొన్నారు.

23 మందికి ఉద్యోగ నియామక పత్రాలు



గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పలు ఆరోగ్య కేంద్రాల్లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా (ఎంఎల్‌హెచ్‌పీ) 23 మందికి నూతనంగా ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చారు. శుక్రవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో (ఆర్డీ) జరిగిన కౌన్సెలింగ్‌లో ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు విధులను చిత్తశుద్ధితో నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. శనివారం మూడు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డాక్టర్ యాస్మిన్ వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న సంయుక్త కమిషనర్ కృష్ణవేణి

పట్నంబజారు : రహదారి భద్రతే ధ్యేయంగా పోలీసు శాఖ సమన్వయం చేసుకుని ప్రమాదాలు తగ్గించేందుకు అందరూ పాటుపడాలని రవాణా శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ డాక్టర్ బి.కృష్ణవేణి చెప్పారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో శుక్రవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికారుల సమావేశం జరిగింది. కృష్ణవేణి మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్‌లు వాహనాలు నడపడంపై దృష్టిసారించాలన్నారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సు నిర్వహించి డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. లారీలు, ట్రాక్టర్లు, ఆటోల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. త్రైమాసిక పన్నుల విషయంలో నిర్ణీత సమయంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే వారికి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను పూర్తి స్థాయిలో జరిమానాలు చెల్లించిన తర్వాతే విడుదల చేయాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల డీటీసీలు, షేక్ కరీం పాల్గొన్నారు.

పక్కపార్టీలు అందించే ఆక్సిజన్‌పై ఆధారపడి బతుకుతున్నావ్

- ఒంటరిగా పోటీచేస్తే టీడీపీకి డిపాజిట్‌లు కూడా రావు
- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: పక్కపార్టీలు అందించే ఆక్సిజన్‌పై ఆధారపడి బతుకుతున్నావ్..ఒరిజనల్‌గా నువ్వు ఒంటరిగా పోటీచేస్తే ఎక్కడా డిపాజిట్‌లు కూడా రావని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నిజాంపట్నంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు యాత్ర పేరుతో జాతర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. నువ్వు ఎన్ని వాగ్దానాలు ఇచ్చినా నిన్ను, నీకు వత్తాసు పలికే పార్టీలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని తెలిపారు. ఏదైనా ఒకమాట ఇస్తే ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అనే సంపూర్ణ విశ్వాసం ప్రజల్లో ఉందని దానిని చెదరగొట్టడానికి నువ్వు ఎన్ని డ్రామాలు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేనేలేరని తెలిపారు. ఎప్పుడు మాట్లాడినా పచ్చి అబద్ధాలే మాట్లాడతారని తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు మాట్లాడుతున్నారు ఇంట్లో ఎంతమంది ఆడపిల్లలు ఉంటే అంతమందికి రూ.1500 చొప్పున ఇస్తారంట, స్కూల్‌కి వెళ్లే ప్రతి పిల్లవాడికీ ఉచితంగా బస్సు ఎక్కిస్తాడంట ఇలా ఎవేవో పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఎస్పీ వకుల్ జిందాల్
- హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కులు అందజేత


హెడ్ కానిస్టేబుల్ భార్య కనికరమ్మకు చెక్కు అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల: జిల్లాలోని జె.పంగులూరు పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మే 13వ తేదీన గుండెపోటుతో మృతి చెందిన జి.కిరణ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. కిరణ్‌కుమార్ భార్య కనికరమ్మకు అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష, ఫ్లాగ్‌ఫండ్ రూ.50వేలు, విడో ఫండ్ రూ.25వేల చెక్కులను ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం అందజేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య వచ్చిన, ఏ సహాయం కావాలన్నా తక్షణం స్పందించి సహాయం అందించడానికి పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డీపీఓ బి.సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక ఉన్నారు.

మార్టూరులో పోలీసుల కార్డన్ సెర్చ్


క్వార్టర్స్‌లో తనిఖీ నిర్వహిస్తున్న మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్సై కమలాకర్

మార్టూరు: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మార్టూరు జాతీయ రహదారి సమీపంలో తరచూ జరుగుతున్న గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు స్థానిక అమరావతి టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నూలు మిల్లులో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పీ మహేష్ ఆదేశాలతో బాపట్ల డీఎస్పీ టీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్, మార్టూరు, యద్దనపూడి, జే పంగులూరు ఎస్సై, ఇద్దరు ఆర్‌ఎస్‌ఐలతో సహా 150 మంది సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి నూలు మిల్లు కార్మికులకు చెందిన 450 క్వార్టర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత బుధవారం మార్టూరు పోలీసులు నమోదు చేసిన ఓ గంజాయి అక్రమ రవాణా కేసులో మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురిని, మార్టూరుకు చెందిన ఒకరిని నిందితులుగా పోలీలుసు అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో వీరి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న మరొక ఎనిమిమంది వివరాలు కూడా ఇక్కడి నుంచే లభ్యం కావడంతో ఎస్పీ నూలుమిల్లు కార్మికులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో అధికారులు కార్మికుల నివాసాలను సైతం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు కార్మికులకు అవగాహన కల్పిస్తూ మత్తు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరమని ఇందుకు పాల్పడుతున్న వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి అనంతరం పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జీవనం కోసం వచ్చిన కార్మికులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

మల్టీడే క్రికెట్ విజేత గుంటూరు



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అంతర జిల్లాల సీనియర్ పురుషుల మల్టీడే క్రికెట్ మ్యాచ్ విజేతగా గుంటూరు నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు ఏసీఏ(సీపీ, డీవీఆర్) మైదానంలో ఆరు ఇన్నింగ్స్‌లలో నిర్వహించిన మ్యాచ్‌లలో ఉమ్మడి గుంటూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. అత్యధికంగా 13 పాయింట్లతో గుంటూరు ప్రథమ స్థానంలో నిలవగా తొమ్మిది పాయింట్లతో పశ్చిమగోదావరి రెండో స్థానంలో, ఆరు పాయింట్లతో కృష్ణా మూడో స్థానంలో, రెండు పాయింట్లతో ప్రకాశం నాలుగో స్థానంలో నిలిచాయి.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి


అనిల్ మృతదేహం

పర్చూరు(చినగంజాం): చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ జారిపడి ఓ వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని చిననందిపాడు గ్రామానికి చెందిన పొన్నలూరి అనిల్ (29) వ్యవసాయం చేసకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఉదయం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి దానిలో పడి చనిపోయాడు. అతడి మృతదేహం నీటిపై తేలియాడుతుండటంతో సమాచారం అందుకున్న బంధువులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్ చెంచుప్రసాద్ సందర్శించి పరిశీలించి మృతదేహాన్ని వెలికితీశారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఓ పాప కాగా వారు కొంత కాలంగా అతనికి దూరంగా ఉంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



అద్దంకి రూరల్: గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకి నార్కెట్‌పల్లి నామ్ రహదారి పైనున్న అద్దంకిలోని మధురానగర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టటంతో గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో రోడ్డు మీద పడిఉన్నాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడు గళ్ల బనియన్ ధరించి ఉన్నాడు. వయస్సు 50 సంవత్సరాల పైనఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

నవోదయంతో.. బతుకు దారి


నవోదయంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో శుక్రవారం నిర్వహించిన నవోదయంలో భాగంగా జిల్లా వ్యాపితంగా అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల యువత, మహిళలు హాజరై ఉద్యోగం, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరుతూ 424 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమ నిర్వహణ అధికారి, సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ ఓబుల నాయుడు, నోడల్ అధికారి సంజీవరావు, ఆయా శాఖల మండల అధికారులు, బ్యాంకర్లు దరఖాస్తులు పరిశీలించారు. దరఖాస్తులలో ఉద్యోగాల కోసం ఎస్సీలు 35 మంది , ఏడుగురు ఎస్టీలు, 33 మంది బీసీలు, ఓసీల నుంచి తొమ్మిది మంది అర్జీలు అందాయి. బ్యాంక్ రుణాల కోసం ఎస్సీలు 247 మంది, ఎస్టీలు 104, బీసీలు 56, ఓసీలు 17 దరఖాస్తులతో మొత్తం 424 వినతులు వచ్చినట్లు నవోదయం నోడల్ అధికారి సంజీవరావు వెల్లడించారు. ఉపాధి అవకాశాలకు సంబంధించి 20 మంది యువతకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. తరలివచ్చిన ప్రజలకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున ఉచిత అన్నదానం నిర్వహించారు.

సమాజంలో మార్పు కోసం యువత కదలాలి

సినీ దర్శకుడు, నటుడు ఆర్.నారాయణమూర్తి


ఆర్. నారాయణమూర్తిని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: మెరుగైన సమాజ రూపకల్పన దిశగా యువతరం నడుం బిగించాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్. నారాయణమూర్తి తాను ఇటీవల నిర్మించిన సందేశాత్మక చిత్రం 'యూనివర్సిటీ' విశేషాలను గురించి విద్యార్థులకు వివరించారు. యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులు లక్ష్యంగా వారి భవిష్యత్, వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను ప్రస్తావిస్తూ నిర్మించిన చిత్రాన్ని యువతరం ఆదరించాలని కోరారు. గత వేసవిలో విడుదల చేసిన యూనివర్సిటీ చిత్రాన్ని విద్యార్థులు, యువతరం కోసం త్వరలోనే రీ-రిలీజ్ చేయనున్నట్లు చెప్పారు. ఆర్.నారాయణమూర్తిని కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జేవీ సుధీర్‌కుమార్, ఎన్‌సీసీ మేజర్ కుమార్‌రాజా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయించాలి

డీఆర్డీఏ పీడీ అర్జునరావు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు

అద్దంకి రూరల్: జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులచే వేగవంతంగా పూర్తిచేయించాలని డీఆర్డీఏ పీడీ అర్జునరావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ గృహనిర్మాణాలు చేపట్టిన వారు ఏ స్టేజిలో ఉన్నా సరే వారు కోరితే డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేలు అందజేయాలని తెలిపారు. 35 ఇళ్ల లబ్ధిదారులు దరఖాస్తుకున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు తెలియజేయటంతో వెంటనే రుణం మంజూరు చేసి పనులు వేగవంతంగా పూర్తిచేయించాలన్నారు. అనంతరం వెలుగు కార్యాలయాన్ని పీడీ సందర్శించారు. మహిళల జీవనోపాదులు మెరుగుపరిచేందుకు పీఎంఈవై, పలు సబ్సిడీ పథకాల రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ దాశరథిశర్మ, ఏఈ కిరణ్, ఎంపీడీవో దేవసేన కుమారి, ఏరియా కోఆర్డినేటర్ రవి కుమార్, ఐదు మండలాల ఏపీఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కొత్త బస్సులకు అనుమతులు

డీపీటీవో విజయ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న డీపీటీవో విజయ్‌కుమార్‌రెడ్డి

అద్దంకిరూరల్: కొత్త బస్సులకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని డీపీటీవో విజయ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాధారణ పరిశీలనలో భాగంగా అద్దంకి ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అద్దంకి పనితీరు బాగుందని, నిధులు వస్తే బస్టాండ్ ఆవరణలో పనులు పూర్తి చేయిస్తామన్నారు. అద్దంకి నుంచి పొదిలి, అద్దంకి నుంచి నరసరావుపేటకు అక్టోబర్ నుంచి మరో రెండు బస్సులు అదనంగా నడపనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే బస్సులు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన బస్సుల్లో ఎలాంటి మార్పులు చేయవద్దని డీఎంను ఆదేశించారు. అద్దంకి బస్టాండ్‌లో షాపుల నిర్వహణకు టెండర్లు పూర్తయ్యాయని, బల్లికురవ, మేదరమెట్లలో షాపుల నిర్వహణకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎం రామ్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన కృష్ణా, ప్రకాశం టెస్ట్ మ్యాచ్

రెండో ఇన్నింగ్స్‌లోనూ వరుణ్‌సాత్విక్ సెంచరీ


కె.నాని, 5వికెట్లు, కృష్ణా బౌలర్


వరుణ్‌సాత్విక్ 112 పరుగులు


జి.గురుపార్థసారథి, 5వికెట్లు, ప్రకాశం బౌలర్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కే ఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-19 బాలుర మూడు రోజుల టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. శుక్రవారం మూడో రోజు తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు 9 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. కృష్ణా జట్టులోని స్టార్ బ్యాట్స్‌మెన్ వరుణ్‌సాత్విక్ తన రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ(112 పరుగులు) సాధించాడు. ప్రకాశం జట్టు బౌలర్లు జి.గురుపార్థసారథి 5 వికెట్లు, సాత్విక్ 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ప్రకాశం జట్టు మ్యాచ్ ముగిసే సమయానికి 9 వికెట్లు నష్టానికి 200 పరుగులు చేసింది. ప్రకాశం జట్టులోని సాత్విక్ 63, కె.ఆనంద్ 49, ప్రణవ్ 31, అభినవ్ 30 పరుగులు సాధించారు. కృష్ణా జట్టు బౌలర్ నాని 5 వికెట్లు సాధించాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన కృష్ణా జట్టుకు 3 పాయింట్లు, ప్రకాశం జట్టుకు ఒక పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

వైకుంఠపురం ఆలయ సూపరింటెండెంట్‌పై కేసు

తెనాలిరూరల్: హుండీ లెక్కింపు సందర్భంగా చేతివాటం ప్రదర్శించిన తెనాలి వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సూపరింటెండెంట్ నిర్మలాకుమారిపై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నెల 12వ తేదీన ఆలయ హుండీ లెక్కింపు సందర్భంగా నిర్మలకుమారి బంగారు ఉంగరాన్ని తీసి ఆమె తన చేతికి పెట్టుకోవడాన్ని లెక్కింపులో ఉన్న కొందరు గమనించారు. ఇదే విషయాన్ని ఆలయ సహాయ కమిషనర్ తిమ్మానాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన విచారించి ఆమెను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. ఇదే విషయాన్ని తిమ్మానాయుడు వన్‌టౌన్ పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం అర్ధరాత్రి కేసు నమోదు చేసినట్టు సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

నిబంధనల మేరకు ఆలయాలు అప్పచెప్పండి

- దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశం
- నాలుగు జిల్లాల ఈఓలతో సమీక్ష


మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ, వేదికపై అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్

గుంటూరు ఈస్ట్: జీవో 298 అనుసరించి రూ. 5 లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవాలయాలను వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులకు నిబంధనలను అనుసరించి స్వాధీనం చేయాలని దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ జిల్లా అధికారులను ఆదేశించారు. కొత్తపేటలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఒంగోలు జిల్లాల ఈవోలతో అధికారులు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణలకు గురైన భూములను ఆర్డినెన్స్-5 అనుసరించి ఎగ్జిక్యూటివ్ అధికారి ఆక్రమణదారుడికి తొలుత నోటీసులు జారీ చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు. అప్పటికీ ఆక్రమణ చేసి ఉంటే పోలీసు, రెవెన్యూ శాఖల సహకారంతో భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉండే దేవదాయ, ధర్మాదాయ భూముల వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేయాలన్నారు. అనంతరం అవి సరిగా ఉన్నాయోలేదో సరిచూడాలని సూచనలు చేశారు. అర్చకులకు ఇల్లు నిర్మించేందుకు స్థలాలు సేకరించి అర్హులైన వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్‌లో వంశపారంపర్య అర్చకుల పేర్లు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్, డెప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.